న్యూజెర్సీ కథ

# పవిత్రద్రోహి

"అమ్మా..." సన్నని మూలుగు ఆ నిశ్శబ్ద నిశీథిలో నీరసంగా ప్రతి ధ్వనించింది. ఆలోచనలతో పరధ్యానంగా నడుస్తున్న శ్రీపతి ఉలిక్కిపడి ఆగాడు.

"అమ్మా..." దీనంగా మరోసారి వినిపించిందా మూలుగు. ఆందోళనగా పరిసరాలను పరికించాడు శ్రీపతి. రోడ్డుపక్కగా మట్టిలో బోర్లాపడివున్న ఆకారం కనిపించగానే గబగబ అటు వెళ్ళాడు. బోర్లాపడివున్న ఆ వ్యక్తి దుస్తులు చీలికలై శరీరంమీది గాయాలూ తలపక్కగా రక్తపు మడుగూ మసక వెన్నెల వెలుగులో అస్పష్టంగా కనిపిస్తున్నాయ్. శ్రీపతి గుండె జల్లుమంది.



అపస్మారక స్థితిలో మూలుగుతున్న ఆ వ్యక్తిని చేతుల్లోకి తీసుకుని మెల్లగా తన వైపు తిప్పుకున్న శ్రీపతి ఆ వ్యక్తి మొహంలోకి చూస్తూనే నెత్తిమీద పిడుగు పడినట్టు విభ్రాం'తికి లోనయ్యాడు. "జ...గ్గ...దు...దొ...రా..."

అప్రయత్నంగా అతని నోటి నుండి వెలువడ్డాయా అక్షరాలు. రెండు క్షణాల తరువాత తేరుకుని చుట్టూ చూశాడు శ్రీపతి. మసక వెలుగులో మెలికలు తిరిగిన కొండచిలువలా కనిపిస్తోంది తారు కొట్టుకుపోగా గోతుల మయమైన కంకర రోడ్డు. జగ్గదు దొరకి కొద్ది దూరంలో తుప్పల్లో పడివుంది అతనెప్పుడూ ఉపయోగించే మోటార్ సైకిల్. ఏం జరిగి ఉంటుందో ఊహించుకోగలిగాడు శ్రీపతి. ఇంతకు ముందు కూడా అదే చోట్లో రెండు ఏక్సిడెంట్లు జరిగాయి.

ఇంద్రగంటి లక్ష్మీనారాయణ

ఆలోచనలకు అవకాశమివ్వకుండా సుశిక్షితుడైన సైనికుడిలా చకచక కదిలాడు శ్రీపతి. జేబురుమాలుతో అతడి గాయాలనుండి స్రవిస్తున్న రక్తాన్ని శుభ్రపరిచి తన చేతి సంచిలోని

వాటర్ బాటిల్ అతని నోటికందించాడు. మెల్లగా గుటకలు వేశాడు జగ్గడు దొర. అతడిని జాగ్రత్తగా క్రింద పడుకోబెట్టి దూరంగా పొలాలలో మినుకు మినుకుమంటున్న దీపాల వైపు వడివడిగా నడిచాడు. మరికొద్ది క్షణాల్లోనే కొండడి ట్రాక్టరుతోసహా అక్కడికి చేరుకున్నాడు శ్రీపతి.

ఇద్దరూ సాయంపట్టి జగ్గడు దొరని ట్రాక్టరులోకి చేర్చాక అరగంటలో టౌన్లోకి గవర్నమెంటు హాస్పిటల్ చేరుకుంది ట్రాక్టరు. అతడిని ఎమర్జెన్సీ వార్డులో జాయిన్‌చేసి "కొండా...జగ్గడు దొర ఇంటికి వెళ్ళి కబురు చెప్పు..." అంటూ కొండడికి పురమాయించి డ్యూటీ డాక్టరు దగ్గరికి వెళ్ళాడు శ్రీపతి.

జగ్గడు దొరని గుర్తుపట్టిన డాక్టరు అతడి గాయాలకు డ్రస్సింగ్ చేసే ప్రయత్నంలో ఉన్నాడు. అప్పటికే గబగబ రెండు ఇంజక్షన్లు చేశాడు. శ్రీపతిని చూసి అన్నాడు..."రక్తం చాలా పోయింది. వెంటనే రక్తం ఎక్కించాలి. లేకపోతే ప్రాణాపాయం...కానీ మా దగ్గర స్టాకు లేదు...ఈ సమయంలో బ్లడ్ బ్యాంక్..."

డాక్టరు మాటలకు అడ్డొస్తూ త్వర త్వరగా అన్నాడు శ్రీపతి "నా రక్తం ఓ పాజిటివ్ గ్రూప్ సార్. ..పేషంట్‌ది కూడా అదే బ్లడ్ గ్రూపయితే రక్తం ఇవ్వడానికి నాకేం అభ్యంతరం లేదు...ప్లీజ్..."

జగ్గడు దొర బ్లడ్ గ్రూప్ చెక్ చేయమని నర్స్‌కి పురమాయించి శ్రీపతిని అడిగాడు డాక్టర్ "మీరు. ..అతనికేమవుతారు..."

"స్నేహితుణ్ణి..." భావరహితంగా చెప్పాడు శ్రీపతి. ఆ సమాధానం విని డాక్టరు కళ్ళల్లో ఆశ్చర్యం తొంగిచూసింది. కుర్చీలో కూర్చుంటూ అడిగాడు.

"దెబ్బలెలా తగిలాయో వివరంగా చెప్పండి..." చెప్పాడు శ్రీపతి.

"ఏక్సిడెంటన్నమాట...పోలీసులకి రిపోర్ట్ చేశారా..."

"లేదు...అతను ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడనీ..."

టేబిల్ మీది ఫోనందుకున్నాడు డాక్టరు "మెడికో లీగల్ కేసిది. పోలీసులకి రిపోర్ట్ చేయాలి" అంటూ నంబరు డయల్ చేయసాగాడు.

మౌనంగా కూర్చున్నాడు శ్రీపతి. డాక్టరు ఫోన్లో పోలీసులతో మాట్లాడుతూండగా నర్స్ వచ్చింది "సార్...పేషెంట్ బ్లడ్ గ్రూప్ ఓ పాజిటివ్..."

ఆ మాటలతో గుండెలమీది బరువు తొలగినట్లు తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు శ్రీపతి. మరికొద్ది క్షణాల్లో శ్రీపతి ఇంట్లోని రక్తం జగ్గడుదొర రక్త నాళాల్లో ప్రవహించే ఏర్పాట్లు పూర్తయ్యాయి. అలసటగా కళ్ళు మూసుకున్నాడు శ్రీపతి.

వెలుగురేఖలు విచ్చుకుంటూండగా డ్యూటీ ముగించుకుని వెడుతూ శ్రీపతితో చెప్పాడు డాక్టర్... "ప్రాణాపాయం తప్పింది. కొద్ది గంటల్లో కోలుకుంటాడు"

శ్రీపతి వదనంలో ప్రసవ వేదనానంతరం ముద్దులొలికే బిడ్డను కన్న తల్లి మోములో కనిపించే ఆనందం...విశ్వ రహస్యాలను ఛేదించిన శాస్త్రవేత్త కళ్ళల్లో కనిపించే తృప్తి.

ఎప్పుడొచ్చారో జగ్గడు దొర భార్యా పిల్లలూ... మంగళ సూత్రాలను కళ్ళకద్దుకుంటూ శ్రీపతి కాళ్ళకు నమస్కరించబోయింది జగ్గడు దొర భార్య. వారించాడు శ్రీపతి.

అంతలో బిలబిలమంటూ వార్డులోనికి దూసుకొచ్చారో యాభైమంది వ్యక్తులు. వాళ్ళందరూ జగ్గడు దొర స్వగ్రామమైన రాజుపేట గ్రామస్థులే. ఉగ్రమూర్తుల్లా ఉన్న వాళ్ళందర్నీ చూడగానే నీరసంగా ఎదురొచ్చాడు శ్రీపతి. ఆవేశంగా అతన్ని చుట్టుముట్టి నిలదీసారు వాళ్ళందరూ. శ్రీపతి జగ్గడు దొరను రక్షించడం వాళ్ళెవరికీ నచ్చని అంశం. "మమ్మల్నందర్నీ జగ్గడు దొరకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం చేసిన మీరే జగ్గడు దొర పక్షం వహించడానికి కారణమేమంటూ తలోమాట ఎవరికి తోచినట్టు వాళ్ళు తమ ఆగ్రహాన్ని శ్రీపతి మీద కురిపిస్తున్నారు.

వాళ్ళ ఆవేశానికి కారణం లేకపోలేదు. జగ్గడు దొర చేయని అన్యాయం లేదు. తలపెట్టని అక్రమం లేదు. అతని దుర్మార్గాలకు ఆ ఊరి ప్రజలందరూ ఏదో ఒక సందర్భంలో రుచి చూసినవారే. అతనికి వ్యతిరేకంగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాడనే నెపం మీద పంచాయతీ ప్రెసిడెంటుని అతనే హత్య చేయించాడని చెప్పుకుంటూంటారు. గ్రామస్థులను బెదిరించి ఓట్లు వేయించుకుని దొంగ ఓట్లు బలంతో పంచాయతీ ప్రెసిడెంటయి ప్రభుత్వ నిధులను ఇష్టారాజ్యంగా అనుభవిస్తున్నాడు. పెద్ద పెద్ద రాజకీయ నాయకులకు కిరాయి గూండాగా చెలామణీ అయ్యే జగ్గడు దొరను ఎదిరించే సాహసంలేని ఆ ఊరి ప్రజలు అతడి ఆగడాలను మౌనంగా సహిస్తూ వస్తున్నారు.

శ్రీపతి స్కూల్ టీచరుగా ఆ ఊరిలో అడుగుపెట్టినప్పటి నుండి గ్రామస్థులందరినీ ఏకంచేసి జగ్గడుదొర అక్రమాలను ఎప్పటికప్పుడు నిలదీసేలా చేయగలిగాడు. పిరికితనం వదిలి అతడి దుర్మార్గాలను ఎదిరించమని వారికి కష్టంమీద నచ్చజెప్పి జగ్గడుదొరపై ప్రభుత్వానికి ఫిర్యాదు తయారుచేసి ఊరి ప్రజల సంతకాలను సేకరించ గలిగాడు. సాక్ష్యాధారాలతోసహా ఆ ఫిర్యాదును జిల్లా కలెక్టరుకు సమర్పించి తిరిగి వస్తూండగానే ఈ సంఘటన జరిగింది.

ఏ వ్యక్తి పీడనయితే వదిలించుకోవాలని గ్రామ ప్రజలందరూ ఏకమయ్యారో ఆ జగ్గడు దొరని తన రక్తం ధారపోసి శ్రీపతి రక్షించడం వారి ఆగ్రహానికి కారణమయింది. ముప్పావంతుకు పైగా కాంట్రాక్టు నిధుల్ని స్వాహా చేసి జగ్గడు దొర వేయించిన తారు రోడ్డు ఒక్క వానకే గోతుల మయమై ప్రమాదాల నిలయమై జగ్గడుదొర ప్రాణాలనే బలికోరితే శ్రీపతి మోకాలడ్డినందుకు అతడిని నిందించారు.

శాంత గంభీరంగా అందరి ఆక్రోశం విని వారందరికీ చేతులెత్తి నమస్కరించాడు శ్రీపతి. "ఇక్కడ రోగుల్ని ఇబ్బంది పెట్టవద్దు. మనం వరండాలో మాట్లాడుకుందాం..."

అతని మాటపై గురివున్న వాళ్ళందరూ వరండాలోకి నడిచారు. అప్పుడు మెల్లగా పెదవి విప్పాడు శ్రీపతి. తుపాకి గుళ్ళలా దూసుకొచ్చాయి మాటలు.

"జగ్గడు దొర దుర్మార్గుడని నేనూ మీతో ఏకీభవిస్తున్నాను. అంతేకాదు. అతని దుర్మార్గాలను వ్యతిరేకించమని మిమ్మల్ని నేనే ప్రోత్సహించాననీ అంగీకరిస్తున్నాను...మీ ధ్యేయం నా ధ్యేయం ఒకటే జగ్గడుదొర దుర్మార్గాన్ని అరికట్టాలని...అంతేకాని జగ్గడు దొరను చంపాలని కాదు... అవునా..." ఎవరూ సమాధానం చెప్పలేదు.

గంభీరంగా చెప్పసాగాడు శ్రీపతి..."చూడండి...మనం ద్వేషించవలసింది మనిషిలోని దుర్మార్గాన్ని... మనిషిని కాదు...మనం చంపవలసింది మనిషిలోని చెడు నడతను. మనిషిని కాదు. చెడ్డ పనులు చేసిన ప్రతి వాడినీ చంపుకుంటూపోతే ప్రపంచంలో మానవజాతే మిగలదు. ఏ మనిషికీ చావు శిక్ష కాదు. మరణంతో మనిషి అంతరించి పోవాదేకాని అతనిలోని దుర్మార్గం అంతరించదు. మనిషిని బ్రతికించి అతనిలోని దుర్గుణాల్ని నిర్మూలిస్తే అతను మంచివాడవుతాడు...సమాజానికి ఉపయోగపడతాడు. జగ్గడుదొర చనిపోతే దిక్కు

మొక్కా లేక ఏ తప్పూ చేయని అతని భార్యా పిల్లలూ అనాథలై శిక్షననుభవిస్తారు కాని తప్పులు చేసిన జగ్గడు దొరకు అది శిక్ష ఎలా అవుతుంది. జగ్గడు దొర చేసిన పాపాలకు శిక్ష అతని భార్యా పిల్లలకు విధించడం న్యాయమా... ఆలోచించండి..." ఆవేశం తగ్గిన ఆ గుంపు శ్రీపతి మాటల్లోని నిజాన్ని గ్రహించి నిశ్శబ్దంగా ఉండిపోయారు.

"ఒక మనిషి చావు బ్రతుకుల్లో కొట్టుమిట్టాడుతూంటే చూసీ చూడనట్లు వదిలేయడం మానవత్వం కాదు. శత్రువుకైనా సరే ఒక మనిషికి సహాయపడే అవకాశం దేవుడు మనకు పెట్టే పరీక్ష. ఈ పరీక్ష తప్పితే మానవ జన్మకు అర్థం లేదు..." నచ్చజెబుతున్నట్టు అన్నాడు శ్రీపతి. గుంపులో ఎవరూ మాట్లాడకపోవడంతో తిరిగి తనే అన్నాడు శ్రీపతి. "ఇప్పటికీ నేను చేసింది తప్పు అని మీరు భావిస్తే మీకందరికీ ద్రోహం చేసాననుకుంటే నా తప్పుకి నేనే శిక్ష విధించుకుంటాను...ఇక ఆ ఊళ్ళో అడుగుపెట్టకుండా మీకు దూరంగా వెళ్ళిపోతాను...మీ న్యాయాన్యాయాలను మీరే నిర్ణయించుకోండి..."

జవాబుగా శ్రీపతికి నమస్కరించి వెనుదిరిగారు వాళ్ళందరూ. శ్రీపతి వదనంలో ఆనందం తొణికిసలాడింది.

అప్పుడే తెలివిలోకి వచ్చిన జగ్గడుదొర శ్రీపతి మాటలన్నీ విన్నాడు. అతని కళ్ళముందు తనపై ఫిర్యాదు చేస్తున్నాడన్న అక్కసుతో శ్రీపతిని చంపడానికి తాను పురమాయించిన గూండాలు రోడ్డుపక్క మాటువేయడం శ్రీపతి ఒంటరిగా నడచి వస్తున్న విషయం ఆ గూండాలకు చేరవేయడానికి తాను ఆదరాబాదరాగా మోటార్ సైకిల్‌పై వెళ్ళడం...ఇంతలో మోటార్ సైకిల్ గోతిలోపడి తను రోడ్డు పక్క రాళ్ళ గుట్టపై పడి కిందకు జారిపోవడం లీలగా కదిలాయ్.

తాను చంపబోయిన మనిషే తనను చావు నుండి రక్షించాడు!

తనను ద్వేషిస్తున్న వ్యక్తి తనకు రక్తదానం చేసి బ్రతికించాడు!!

జగ్గడు దొర కళ్ళు నీటి కుండలయ్యాయి...

అతని పశ్చాత్తాప హృదయానికి శ్రీపతి సాక్షాత్తూ విష్ణుమూర్తిలా కనిపించాడు.

"నీ పవిత్ర ద్వేషంలో తడిసి నేను పునీతుడనయ్యాను. నువ్విచ్చిన ఈ జీవితాన్ని పూర్వపు జగన్నాథంగా మనిషిగా గడుపుతాను..." అనుకుంటూ సజల నయనాలతో చేతులు జోడించాడు జగ్గడుదొర...కాదు కాదు...జగన్నాథం...

శ్రీపతి కళ్ళల్లో ఆనందోదయం...తూరుపు దిక్కున సూర్యోదయంలాగే!!

పెళ్ళిలో కూతురైన ఆ అమ్మాయిని నోరు మెదపనివ్వలేదు. ఆడపిల్లలకి ఇష్టాయిష్టాలతో పనిలేదన్నారు. పెద్దలే కూతుళ్ళ మంచి చెడ్డలు చూస్తారన్నాడు. కొండమీది కోతిని కొనలేని బీద తండ్రికి పుట్టినందుకు ఆశలన్నీ చంపుకోవాలన్నాడు. ఆ తండ్రి మాటలకే ఆ అమ్మాయి తల్లి కూడా వంత పాడింది.

ఆ విధంగా ఆ అమ్మాయి తల వంచుకుంది. వంచిన ఆ అమ్మాయి తల మీద 'జీలకర్రా–బెల్లం'తో ప్రమాణాలూ, మెళ్ళో మూడుముళ్ళూ పడిపోయాయి.

'పెళ్ళి=రాజీ = స్వర్గంలో దేవతల నిర్ణయం!!' – అనుకుంటుందా అమ్మాయి. చెల్లెళ్ళ కోసం... తల్లిదండ్రుల బరువుబాధ్యతల్ని తీర్చడం కోసం ఆ అమ్మాయి తలవంచుకుని మెట్టినింట అడుగుపెట్టి గృహిణిగా మారి బరువుబాధ్యతల్ని తలకెత్తుకుంది.

గృహిణిగా తనకున్న ఆస్తిపాస్తులేమిటని ఆ అమ్మాయి ఆలోచించింది. పాతిక వేలు పెట్టి కొనుక్కున్న బాధ్యతల వలయంలో ఇరుక్కుపోయిన కాంతుడు... ఆమెకు కాంచనసముడు. పెళ్ళీడుకొచ్చిన ఆడబిడ్డా, ఇంకా చదువుకుంటున్న మరిదీ, వృద్ధాప్యమనే అనారోగ్యంతో బాధపడుతున్న అత్తమామలూ... వీరంతా ఆమె ధనరాశులు!!

ఆమె తన చదువుకునే రోజుల్ని గుర్తుచేసుకుంది. తన వెంటపడ్డ కుర్రకారుని గుర్తుచేసుకుంది. 'మోహన్', 'రాజు', 'జాన్సన్', 'రహీమ్' – ఇలా ... ఒకరేమిటి?... ఎందరో ఆమె వెనక బాడీగార్డుల్లా తిరిగారు. నోరు మెదపకుండా చొంగలు కార్చుకుంటూ వాళ్ళు ఆమెను బడి నుంచి ఇంటికీ, ఇంటి నుంచి బడికీ దిగబెట్టేవారు. వాళ్ళల్లో ఏ ఒక్కరికీ ఆమెను పెళ్ళాడే ధైర్యం లేదు. అందరూ తండ్రిచాటు బిడ్డలు! నిరుద్యోగులు! ఆర్థిక స్వాతంత్ర్యం లేని కుర్రకారు, అస్వతంత్రులూ – అసమర్థులూ కాక మరింకేమవుతారు?! పెళ్ళికి ముందు తన అందానికి తానే మురిసిపోయి, తాను కన్న రంగుల కలల్ని తల్చుకుని ఆమె నవ్వుకుంది.

ఆ అమ్మాయికి, ఆ అమ్మాయి తండ్రీ చెప్పాడు – తాము గడ్డి మొక్కల వంటివారమనీ, తమని పెను తుపాన్లు కూడా ఏమీ చేయలేవనీను. తలొంచుకు బతికే వాళ్ళ తలల మీంచి గాలులు వీచుకుంటూ పోతాయిగానీ, ఏమీ చెయ్యవనీ, అదే తలెత్తుకు నిలబడే పెద్ద పెద్ద వృక్షాల్ని పెను గాలులు పెకలించి పారేస్తాయనీ చెప్పాడు. సమాజ కట్టుబాట్లనీ, ఆచార వ్యవహారాల్నీ శాసించే మధ్యతరగతి కుటుంబంలో పుట్టడమే ఓ గర్వకారణమని చెప్పాడు. జీవితమంటేనే కష్టాలననుభవించడమనీ, న్యాయా న్యాయ విచక్షణా, ధర్మాధర్మ వివేచనా ఏ రోజూ మరువద్దని చెప్పాడు. దైవనామస్మరణతో ధైర్యం కూడగట్టుకుని కష్టాల్నెదుర్కోవాలని చెప్పాడు.

ఆ అమ్మాయి పెద్దదవుతున్నకొద్దీ ఆ అమ్మాయికి, ఆ అమ్మాయి తల్లి మరింకెన్నో నీతుల్ని బోధించింది. ఆడపిల్లలకీ – మగపిల్లలకీ మధ్యనెంతో తేడా వుంటుందని చెప్పింది. ఆడపిల్లలకి స్వేచ్ఛగా నలుగురిలో నవ్వే హక్కు లేదంది. ఆడపిల్లలు తలొంచుకు బతకడం నేర్చుకోవాలని చెప్పింది. నలుగురిలో తలవంపులు తేవద్దనీ, పదుగురిలో సిగ్గుపడేలా చేయవద్దనీ పదేపదే కోరుకుంది!

ఆ అమ్మాయి అసలెప్పుడు తలెత్తింది కనక?!

పెళ్ళికి ముందూ తలొంచుకుంది – పెళ్ళిలోనూ తలొంచుకుంది. ఇప్పుడు పెళ్ళయ్యాకా తలొంచుకు బతుకుతోంది. తలొంచుకు బతకడమే తన జన్మహక్కుగా బతుకుతోంది!

'సిగ్గు!!' – సింగారమంటారావ దానికి!? కాని... అమ్మ మాత్రం ఎప్పుడూ సిగ్గుపడేలా చెయ్యొద్దంది! 'పాపం! అమ్మకి సిగ్గనే సింగారం అక్కర్లేదనుకుంటాను' అనుకుని నవ్వుకుందా అమ్మాయి (మనసులో!)

ఆ అమ్మాయి తనకో ప్రాముఖ్యత లేనట్టూ, ఆత్మ లేనట్టూ, తల్లీ – తండ్రీ చెప్పే మాటలకు గంగిరెద్దులా తలూపుతూ తలొంచుకు బతికింది!

'తల వంచుకోవడానికీ – తల వంపులకీ అసలు తేడా ఏమిటీ?!' ఆ అమ్మాయి బుర్ర బద్దలుకొట్టుకుని ఆలోచించింది.

ఆ అమ్మాయి మనసును చంపుకుంది. ఊహించుకున్న అందగాళ్ళని గుండె గోడల్లో సమాధి చేసింది. కుల–మతాల అడ్డుగోడల్ని అతిక్రమించకుండాబతికింది.

గతంలో తల్లిదండ్రుల ఆత్మసంతృప్తి కోసం తలొంచుకుంటే, ఇప్పుడు భర్త, అత్తమామల ఆత్మతృప్తి కోసం తలొంచుకు బతుకుతోంది.

భర్తా – అత్తమామలూ – ఆడపడుచూ – అం–ద–రూ... ముక్తకంఠంతో... 'అ–బా–ర్ష–న్ చేయించుకో!' అనేశారు.

ఇప్పుడు కూడా ఆమె బుద్ధిగా తలొంచుకుంది.

'తలొంచుకు బతికే మరో జీవిని'... 'పెద్దలకి తల వంపులు తెచ్చే మరో జీవిని'... ఈ భూమ్మీదికి తెచ్చి... ఆ జీవినీ బాధపెట్టడం ఆమెకీ ససేమిరా ఇష్టంలేకపోయింది!!

'యత్రనార్యస్తు పూజయంతే!', 'మాతృదేవో భవ!!', 'స్త్రీ = ప్రకృతి = శక్తిస్వరూపిణి!!!!'

మాతృగర్భంనించి బయటపడ్డ సమస్త జీవరాసీ... ఇలాటి సూక్తులని వల్లించే పవిత్ర భారతావని ఇది! పెదవి పైన మాత్రమే సూక్తుల్ని వల్లిస్తూ గుండెల్లోకి కత్తుల్నిదింపే ఘనులున్న దేశం!!

అంతా అయిపోయిందనుకుంటూ.... ఆ అమ్మాయి గర్భంలోంచి బైటపడ్డ ఆడపిండం... పుడమి తల్లి... మట్టిలో .. . ఈ 'అమ్మ' సుఖమనుకుంటూ కలిసిపోయింది!